TGTEL/25/A0827

# ప్రజా దివాన్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9000281049

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 264 | గురువారం 17-09-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ మౌనిక | పేజీలు : 8 వెల 3 /-




మిగతాది 2లో

## భూవివాదం..

### మోదీ స్కూల్‌మేట్‌కు దక్కిన ఊరట



ఏళ్ల నాటి భూవివాదంలో ప్రధాని మోదీ స్కూల్‌మేట్ అస్గర్‌అలీ వోహ్రాకు ఊరట లభించింది. ఈ వివాదం నుంచి వెనక్కి తగ్గిన స్థానిక భాజపా ఎమ్మెల్యే.. ప్రధాని స్నేహితుడికి భూమిని అప్పగించారు. ఈ ఆస్తి వ్యవహారం గురించి అస్గర్ అలీ ఇటీవల మోదీ ని కలిసిన కొన్ని రోజులకే తాజా పరిణామం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..మహారాష్ట్రలోని ఠాణె జిల్లాలో నివసిస్తోన్న 81 ఏళ్ల అస్గర్‌అలీ వోహ్రా.. గుజరాత్ (+బయిఖీష్)లోని భయందర్ ఈస్ట్‌లో గల నవ్‌ఘర్ రోడ్డులో ఉన్న సుమారు 2,810 చదరపు మీటర్ల భూమిని 1989లో కొనుగోలు 02

## భారత నౌకను ఢీకొట్టిన పాక్ నౌక



02

## ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలు బయటకు తీయాలి:

- ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలు బయటపెట్టాలి.
- ధరణి తప్పిదాలతో ప్రజలకు నష్టం జరిగిందని కూనంనేని.
- 3 లక్షల ఎకరాల ప్రైవేటు భూములపై వివరాలు వెల్లడించాలి.
- భూదాన్ భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ చేయాలి.
- నిజాం కాలం భూముల వివరాలు వెలికితీయాలి.
- 22ఏలో సాంకేతిక తప్పిదాలు జరిగాయని వ్యాఖ్య.



02

## వివేకా హత్య కేసు నిందితులకు చుక్కెదురు



హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిందితులకు చుక్కెదురైంది. నిందితుల డిశ్చార్జ్ పిటిషన్లను నాంపల్లి సీబీఐ కోర్టు తిరస్కరించింది. ఏ1 గంగిరెడ్డి, ఏ3 ఉమాశంకర్‌రెడ్డి, ఏ6 ఉదయ్ పిటిషన్లు తిరస్కరణకు గురయ్యాయి. వాటికి విచారణార్హత లేదని కోర్టు పేర్కొంది.

## గురుకులాల పనివేళలపై వివరణివ్వండి: హైకోర్టు

తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనివేళల మార్పుతోపాటు ఉపాధ్యాయులకు బోధనేతర విధులు అప్పగించడంపై వివరణివ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు









TGTEL/25/A0827
ప్రజా దివాన్
తెలుగు దినపత్రిక



# సంపాదకీయం

## బీజేపీ రాజకీయాలకు బ్రిక్స్ పాఠం!



'లోకంలో బలవంతుడైనవాడు చెబితే అధర్మం కూడా ధర్మం అవుతుంది. అదే బలహీనుడు చెప్పే ధర్మం ఎంత గొప్పదైనా దాన్ని ఎవడూ అంగీకరించడు' అని మహాభారతంలో భీష్ముడు కురుసభలో ద్రౌపది వస్త్రాపహరణ ఘట్టంలో చెబుతాడు. 'పాండవులకు జరిగిన అవమానమే భవిష్యత్తులో కౌరవులకు వ్యతిరేకంగా ప్రత్యర్థులందర్నీ ఏకం చేస్తుంది' అని అదే సభలో విదురుడు హెచ్చరిస్తాడు. 'బలవంతుడి శక్తి కంటే భయంతో ఏకమైన బలహీనుల కూటమి శక్తిమంతమైనది' అని విదురుడు చెప్పినట్లుగానే పాంచాల, మత్స్య, యాదవ, మగధ, ఛేది, కాశీ, పాండ్య, చోళ, కేకయ తదితర రాజ్యాలన్నీ పాండవుల తరఫున ఏకం అవుతాయి. చాణక్యుడైనా, ఇటాలియన్ రాజనీతిజ్ఞుడు మాకియవెల్లీ అయినా ఇంతకంటే భిన్నంగా ఏమీ ఆలోచించలేదు. న్యూఢిల్లీలో గతవారం ముగిసిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో మహాభారతంలోని దౌత్యనీతి ప్రస్ఫుటించింది.

తాను అత్యంత బలవంతుడిననుకున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను వ్యక్తిగతంగా బ్రిక్స్ దేశాలు పైకి పల్లెత్తు మాట అనకుండానే ఆయనకు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపించాయి. ఏక పక్ష దౌర్జన్య చర్యలు, వర్తకాన్ని దెబ్బతీసే టారిఫ్ లను న్యూఢిల్లీ డిక్లరేషన్ తీవ్రంగా ఖండించింది. బ్రిక్స్ వేదికపై విభిన్న ప్రయోజనాలను ఆశిస్తున్న అనేక దేశాలు ఏకమయ్యేందుకు అవసరమైన వాతావరణాన్ని ట్రంప్ అనాలోచితంగానే అందించారు. సంక్షుభిత ప్రజాస్వామ్య భారత్, నియంతృత్వ చైనా, రష్యా దేశాలు, అమెరికాతో సన్నిహిత భద్రతా సంబంధాలు ఉన్న గల్ఫ్ దేశాలు, అమెరికా దాడిని ఎదుర్కొంటున్న ఇరాన్.. ఇవన్నీ ఒక వ్యూహాత్మక ప్రాపంచిక దృక్పథాన్ని పంచుకునేందుకు అవకాశాన్ని ట్రంప్ కల్పించారు. అమెరికా అధ్యక్షుడి దూకుడు విధానాల వల్ల ఈ దేశాలన్నీ ఒత్తిడి ఎదుర్కోవడమే ఇందుకు కారణం. డాలర్ ఆధిపత్యాన్ని సవాల్ చేసే దేశాలపై అత్యధిక సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించినప్పటికీ బ్రిక్స్ దేశాలు ప్రత్యామ్నాయ చెల్లింపు విధానాలను వెతుక్కునేందుకు ఆయనే దోహదం చేశారు. వాణిజ్యం కోసం, స్థానిక జాతీయ కరెన్సీల వాడకాన్ని న్యూఢిల్లీ డిక్లరేషన్ సమర్థించింది. పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు ఇది సభ్య దేశాలకు ఊతమిచ్చింది.

భిన్న రాజకీయ వ్యవస్థలు, భద్రతా ప్రయోజనాలు కలిగిన కూటమి అయినప్పటికీ ఎలాంటి రణగొణ ధ్వనులు లేకుండా బ్రిక్స్ సమావేశంలో అత్యంత సమగ్రమైన, ప్రభావదాయక ఏకగ్రీవ డిక్లరేషన్‌ను విడుదల చేయగలగడమే ఆ దేశాల మధ్య ఏర్పడిన ఉమ్మడి అవగాహనకు నిదర్శనం. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థ ఏకపక్ష ఆర్థిక ఒత్తిళ్లకు గురవుతోందనే సాధారణ భావనే వీటన్నింటినీ ఒక తాటిపైకి తెచ్చింది. ఈ సదస్సుకు భారత్ నాయకత్వం వహించినందువల్ల సహజంగానే రెండు రోజుల పాటు జరిగిన సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్ర బిందువుగా నిలిచారు.

భారత్ ప్రస్తుత పరిస్థితి కత్తి మీద సాము లాంటిది. పలు వైరుధ్యాలతో కూడిన సంబంధాలను ఏకకాలంలో సమన్వయం చేసేందుకు భారత్ ప్రయత్నించాల్సి వచ్చింది. చైనాతో సరిహద్దు ఘర్షణలు, ఆర్థిక ఆధిపత్యం నేపథ్యంలో ఆ దేశాధినేతతో సుహృద్భావ వాతావరణంలో చర్చించడం, రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగించడం, సంక్షుభిత పశ్చిమాసియాలో ఇరాన్‌తో చర్చలు జరపడం, అభివృద్ధి చెందిన దేశాల గళంగా, గ్లోబల్ సౌత్ నేతగా అవతరించేందుకు ప్రయత్నించడం ఇందులో ముఖ్యమైనవి. అంతేకాదు, రష్యాతో రక్షణ, ఇంధన రంగ సహకారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని భారత్ స్పష్టం చేసింది. పాశ్చాత్య కూటములతో చేతులు కలుపుతూనే, సంప్రదాయ మిత్రులను విస్మరించబోమనే వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ప్రకటించింది. అదే సమయంలో, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీ సదస్సులో ఒక సున్నితమైన దౌత్య వ్యూహాన్ని అవలంబించారు. పశ్చిమ దేశాలను తిరస్కరించడం పూర్తిగా తమ వ్యూహం కాదని, ఆ దేశాలతో సంబంధాలు కొనసాగిస్తూనే అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను ఏకకాలంలో కాపాడుకోవాలన్నదే భారత్ వైఖరి అని ఆయన స్పష్టం చేశారు. అమెరికా ఒత్తిడి, చైనా ఆధిపత్యం మధ్య భారత్ తనను తాను ఒక ఆచరణాత్మక ప్రత్యామ్నాయంగా ప్రదర్శించుకోవడానికి ప్రయత్నించింది. అదే సమయంలో వాషింగ్టన్ ఎంత గట్టిగా ఒత్తిడి తెచ్చినా, దానిపై ఆధారపడకుండా యంత్రాంగాలను అభివృద్ధి చేయగలమని చెప్పగలగడమే ఈ బ్రిక్స్ సమావేశాల ప్రత్యేకత.

చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ ఈ సదస్సులో చేసిన ప్రసంగం అత్యంత శక్తిమంతమైనది. 'నియమాలు లేని ప్రపంచం అంటే ట్రాఫిక్ సిగ్నల్స్ లేని కూడలి వంటిది. అంతర్జాతీయ నియమాలను అన్ని దేశాల భాగస్వామ్యంతోనే, అందరికీ ఒకే విధంగా ఉండేలా రూపొందించాలి. బలవంతుడిదే న్యాయం అనే సిద్ధాంతానికి అంతర్జాతీయ వ్యవహారాల్లో ఎలాంటి స్థానం ఉండకూడదు. ప్రపంచ దక్షిణ దేశాలు అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ పాలనను (రూల్ ఆఫ్ లా) సమష్టిగా పరిరక్షించాలి' అని జిన్ పింగ్ అన్నారు. బహుళ ధ్రువ ప్రపంచం అనే దాన్ని ఎవరూ మార్చలేరని, ప్రపంచాన్ని తమకోసం సుందరవనంగా, ఇతరులకు కీకారణ్యాలుగా మార్చేందుకు చేసే ప్రయత్నాలు చెల్లవని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. జారిపోతున్న తమ నాయకత్వాన్ని కాపాడుకోవడానికి పాత నేతలు కొందరు ఆంక్షలు, అడ్డంకులు సృష్టిస్తున్నారని, కానీ ఇవి ప్రత్యామ్నాయ, స్వతంత్ర వాణిజ్య మార్గాలను వేగవంతం చేస్తున్నాయని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగంలోనూ బలమైన వ్యాఖ్యలు లేకపోలేదు. 'మనం నిబంధనలను పాటించేవారిగా (రూల్--టేకర్స్) కాకుండా, నిబంధనలను నిర్దేశించేవారిగా (రూల్--షేపర్స్) ఎదగాల్సిన అవసరం ఉంది' అని మోదీ చెప్పారు. టెక్నాలజీని, కీలక ఖనిజాలను ఆయుధాలుగా వాడుకోవద్దని ఆయన హెచ్చరించారు.

బ్రిక్స్ సదస్సులో అన్నిటికన్నా ముఖ్యమైనది ప్రధానమంత్రి నరేంద్రమోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ మధ్య దాదాపు 45 నిమిషాల పాటు ద్వైపాక్షిక సమావేశం. వ్యూహాత్మక భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ పరస్పర ఆర్థిక ప్రయోజనాలకోసం పనిచేసేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలు వెలువడ్డాయి. గల్వాన్ ఘర్షణల చేదు జ్ఞాపకాలను మరిచి, వాస్తవాధీన రేఖ వద్ద శాంతిని నెలకొల్పేందుకు, ఆర్థిక, దౌత్య మార్గాలను పునరుద్ధరించేందుకు భారత్ సుముఖత చూపింది.

ఈ ఘట్టం ఏ పరిణామాల్ని సూచిస్తోంది? చైనాతో కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న శత్రుత్వ వాతావరణం మారనుందా? భారత్--చైనా సంబంధాల పునరుద్ధరణ అనేది దౌత్యపరమైన విజయానికంటే వ్యూహాత్మక రాజీని సూచిస్తోందా? అని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. రాజీ అనడం కన్నా ప్రస్తుత అల్లకల్లోల అంతర్జాతీయ వాతావరణంలో అదొక చారిత్రక అవసరం కూడా కావచ్చని మరికొందరు భావిస్తున్నారు. ఈ సమావేశంలో భారత్, చైనాల మధ్య అత్యంత ముఖ్యమైన ఏకాభిప్రాయం ఏర్పడిందని, వ్యూహాత్మక, దీర్ఘకాలిక, దిశానిర్దేశం చేసే అంశాలపై ఇరువురు నేతలు స్పష్టమైన, లోతైన చర్చలు జరిపారని చైనా విదేశాంగ మంత్రి, కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వాంగ్ యీ అనడం విస్మరించదగిన విషయం కాదు. బ్రిక్స్ సమావేశాలు మారుతున్న ప్రపంచ వ్యవస్థను, అంతర్జాతీయ సంబంధాల మార్పును సూచిస్తున్నాయని అమెరికన్ మీడియా వ్యాఖ్యానించింది. అమెరికాతో ఉద్రిక్తతలు ఉన్న ఇరాన్‌కు బ్రిక్స్‌లో ప్రముఖ స్థానం లభించడం గ్లోబల్ ఆర్డర్‌లో మారుతున్న సమీకరణాలకు అద్దం పడుతోందని అమెరికా పత్రికలు ప్రత్యేకంగా విశ్లేషించాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన సుంకాల విధానాలే అంతర్గతంగా గణనీయమైన భేదాభిప్రాయాలు ఉన్న దేశాలను ఒకచోటకు చేర్చే అనుసంధానంగా (బైండింగ్ ఏజెంట్) పనిచేశాయని అమెరికన్ మీడియా భావించింది.

నిశితంగా విశ్లేషించాలంటే అమెరికాయే బ్రిక్స్‌కు సానుకూల పవనాలను (టెయిల్ విండ్) సృష్టించింది. వాషింగ్టన్ విధానాలు, అంతర్జాతీయ సంబంధాలు శాశ్వతంగా ఇలాగే ఉంటాయని చెప్పలేం. బహుళ ధ్రువ ప్రపంచంగా మారేందుకు, భద్రతా మండలి, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు తీరుతెన్నుల్లో మార్పులు ఏర్పడేందుకు సమయం ఆసన్నమైందని, లేకపోతే బ్రిక్స్ మరింత బలమైన ప్రత్యామ్నాయ వ్యవస్థగా మారుతుందని చెప్పేందుకు ఆస్కారం ఏర్పడింది.

దేశ రాజకీయాల్లో కూడా తమ వ్యవహారశైలే ప్రత్యర్థుల బలాబలాలను నిర్ణయిస్తుందని బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో పాలక పక్షం నేతలు గ్రహించాల్సిన అవసరం ఉన్నది. ట్రంప్ ధాటితో పలు దేశాలు ఏకమైనట్లు గడచిన కొన్ని సంవత్సరాలుగా ప్రధానమంత్రి మోదీ, ఆయన కుడిభుజం అమిత్ షా ధాటికి తట్టుకోలేక ప్రత్యర్థి శక్తులన్నీ ఏకమయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. తాజాగా ఉమ్మడి పౌరస్మృతిపై ఎన్డీఏ మిత్రపక్షాలు కూడా అసమ్మతి ప్రకటిస్తున్నాయి. తన 25 సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని

## భారత నౌకను ఢీకొట్టిన పాక్ నౌక

మొదటిపేజీ తరువాయి

అంతర్జాతీయ జలాల్లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. అరేబియా సముద్రంలో భారత నౌకను పాక్ నౌక ఢీకొట్టింది. దీనిని భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దీంతో పాక్ దౌత్యవేత్తకు విదేశాంగ శాఖ సమన్లు జారీచేసింది.

గతేడాది పహల్గాం ఘటన, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య దౌత్యపరంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి సమయంలో మంగళవారం సాయంత్రం భారత నౌకను పాక్ షిప్ ఢీకొట్టింది (ఖుని వాష్ట్రఅజూ-×అ౦ఖుఅ చీఖుజఎ ఖఅఈ). ఇది నిర్లక్ష్యపూరిత ప్రవర్తనగా భారత్ ఖండించింది. "సైనిక విన్యాసాలు, కసరత్తులు , దళాల కదలికలపై ముందస్తు నోటీసుకు సంబంధించి ఇరు దేశాల మధ్య 1991లో ఒప్పందం ఉంది. ఆ ఒప్పందంలోని ఆర్టికల్ 10ని పాక్ నౌక ఉల్లంఘించింది. అనైతిక పద్ధతిలో విన్యాసాలు చేయడమే ఈ పరిస్థితికి దారితీసింది" అని పేర్కొంది.

మసూద్‌ను పట్టించినవారికి రూ.70 లక్షలు: పాక్ ప్రకటన

అలాగే దిల్లీలోని పాకిస్థాన్ (ఖుఎఅర్ఖుఅ) అత్యున్నతస్థాయి దౌత్యప్రతినిధికి సమన్లు ఇచ్చింది. దౌత్యమార్గాల ద్వారా కేంద్రం ఈ ఘటనను లేవనెత్తింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని, ఇరుదేశాల మధ్య ఒప్పందాల్లోని నిబంధనలు గౌరవించేలా సంబంధిత పాక్ అధికారులకు తెలియజేయాలని సూచించింది. పాకిస్థాన్ విదేశాంగ శాఖ వద్ద ఈ ఘటనను లేవనెత్తాలని ఇస్లామాబాద్‌లోని భారత దౌత్యవేత్తకు వెల్లడించింది.

ఈ ఘటన జరిగిన సమయంలో అరేబియా జలాల్లో (ూతీఖుఎఖుఅ వాఖు) భారత నౌక గస్తీ నిర్వహిస్తోంది. భారత్‌వైపు ఎలాంటి నష్టం వాటిల్లలేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. పాక్ నౌక హునైన్ క్లాస్‌కు చెందినదని, భారత్‌ది యుద్ధనౌక అని వెల్లడించాయి. ఆ సమయంలో సముద్రం అల్లకల్లోలంగా ఉందని, ఘటన తర్వాత రెండు నౌకలు దూరంగా వెళ్లాయని చెప్పాయి. కాగా.. 2011లో పాక్ నేవీకి చెందిన బాబర్, ఐఎన్ఎస్ గోదావరి మధ్య ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది.

## అసెంబ్లీలో సీఎం మాట్లాడినవన్నీ పచ్చి అబద్ధాలు:

మొదటిపేజీ తరువాయి

"కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు బయటపెడతామనే భయంతోనే మమ్మల్ని సభ నుంచి సస్పెండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారు. సభలో ప్రతిపక్షం లేకుండా, ప్రజా సమస్యలపై చర్చ లేకుండా తప్పించుకుంటున్నారు. 22ఏపై మేం చెప్పింది నిజమని.. ఇవాళ సీఎం ప్రసంగంతో తేలిపోయింది. 3లక్షల ఎకరాల సమస్య.. 30 లక్షల ఎకరాలకు పెరిగిపోయిందని సీఎం అన్నారు. 22ఏ పై గత కొంతకాలంగా బీఆర్ఎస్ చేస్తున్న పోరాటం అక్షర సత్యం.. ఇవాళ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్న విషయం శాసనసభ సాక్షిగా తేటతెల్లమైంది. కలెక్టర్లు పాత జాబితా అప్‌లోడ్ చేశారు.. కలెక్టర్లు చూసుకోకుండా 30లక్షల ఎకరాలను 22ఏలో చేర్చారని సీఎం చెబితే.. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి మాత్రం ఒక్క ఎకరం కూడా చేర్చలేదని అన్నారు. 22ఏ నుంచి సీఎం ఇల్లును రాత్రికి రాత్రి ఎలా తీశారో.. ప్రజల భూములు కూడా అలాగే తీయాలి. ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారు.. బురదజల్లే ప్రయత్నం చేశారు. 22ఏ తప్పును సరిచేసుకోవాల్సిన పాలకులు విపక్షంపై ఎదురుదాడి చేస్తున్నారు. ప్రభుత్వం తప్పులను ఎత్తి చూపితే.. మాపై వ్యక్తిగతంగా ఎదురుదాడి చేస్తున్నారు. మొత్తం వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరాం.. దానిపై సమాధానం లేదు. ఎన్నికల అఫిడవిట్‌లో మేం చూపిన ఆస్తులే.. ఇప్పుడు సీఎం చెప్పారు.భూ భారతిలో రూ.80లక్షల విలువైన చలాన్ల స్కామ్ జరిగింది. ఒక్క జిల్లాలో రూ.80లక్షల చలాన్ల స్కామ్ జరిగితే .. ఎవరిపైనా చర్యలు లేవు. భూ భారతి ద్వారా ప్రజలకు తెలియకుండానే ప్రజల ఆస్తి.. మరొకరికి బదిలీ అయ్యింది. అసైన్డ్ భూములు పట్టా భూములుగా.. పట్టా భూములు అసైన్డ్ భూములుగా మారాయి. భూభారతి ద్వారా ఇప్పటికే 9,200కు పైగా అక్రమ లావాదేవీలు జరిగాయి" అని హరీశ్‌రావు ఆరోపించారు.

## సీఎం చెప్పిన భూముల చిట్టాపై నిజాలు నిగ్గు తేలాలి: కవిత

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: శాసనసభలో 22ఏ భూములపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పారని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత (ఖుజఔష్ఖు) విమర్శించారు. సిద్దిపేట జిల్లాలో కవిత, ఆమె భర్త పేరు మీద 37.26 ఎకరాల భూమి ఉందని అసెంబ్లీలో సీఎం తెలిపారు. ముఖ్యమంత్రి ప్రకటనపై 'ఎక్స్' వేదికగా కవిత స్పందించారు. "సీఎం ఈ రోజు అసెంబ్లీలో ప్రస్తావించిన నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి సహా అందరి భూములపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నా. నా కుటుంబానికి ఎక్కడో భూములు ఉన్నట్లు సీఎం చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు మించి ఒక్క గజం భూమి నాకు ఎక్కువగా ఉన్నా... ఎన్నికల అఫిడవిట్ లో పేర్కొన్న దానికన్నా గజం భూమి అదనంగా ఉన్నా... ప్రభుత్వానికే సరెండర్ చేస్తానని మరోమారు స్పష్టం చేస్తున్నా" అని కవిత తెలిపారు.

## ఈనెల 19 నుంచి ఉమెన్ ఏపీఎల్: కేశినేని చిన్ని

మొదటిపేజీ తరువాయి

ఈ నెల 19 నుంచి 27 వరకు మంగళగిరి స్టేడియంలో ఉమెన్ ఏపీఎల్ పోటీలు జరగనున్నాయని చెప్పారు. మొత్తం నాలుగు టీమ్‌లు పాల్గొనే ఈ టోర్నమెంటును... డే అండ్ నైట్ విధానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. విజయవాడ ఏసీఏ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... ఉమెన్ ఏపీఎల్ ప్రారంభోత్సవానికి నారా బ్రాహ్మణి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని చెప్పారు. ప్రేక్షకులు ఉచితంగా మ్యాచ్‌లు వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామని, విజయవాడ నుంచి విద్యార్థులను తీసుకువెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఉమెన్ ఏపీఎల్ ద్వారా మహిళా సాధికారతను ఘనంగా చాటబోతున్నామని చెప్పారు. ఈ సీజన్‌లో మంగళగిరి స్టేడియంలో మాత్రమే మ్యాచ్‌లు జరుగుతాయని, వచ్చే సీజన్ నుంచి విశాఖ, కడపలోనూ ఉమెన్ ఏపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించబోతున్నామని చెప్పారు.

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి.. చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి



పటాన్‌చెరు: సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామంలోని వినాయక విగ్రహం నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లిన వారిలో ఆరుగురు ప్రమాదవశాత్తూ నేరేడు చెరువులో పడిపోయారు. వెంటనే స్పందించిన గ్రామస్థులు.. గల్లంతైన వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. మృతులను నరసింహ(21), తేజ(17), సిద్దార్థ(17), గణేశ్ (18), సుమంత్‌రెడ్డి (17), ఉదయ్ కిరణ్ (22)గా గుర్తించారు.

# భూవివాదం..

మొదటిపేజీ తరువాయి

ఈ భూమిని 2011లో స్వయం బిల్డర్స్, సెవెన్ ఎలెవన్ కన్‌స్ట్రక్షన్స్ అనే రెండు సంస్థలు ఆక్రమించుకున్నాయని ఆయన ఆరోపించారు. ఈ రెండు సంస్థలతో భాజపా ఎమ్మెల్యే నరేంద్ర మెహతాకు సంబంధం ఉందని తెలిపారు. ఈ విషయం (వీశీఎఅ ఖీతీఅవఅఎ ఖుఅఎ ఔఅంజూబ్వ)పై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సైతం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

### రూ.3,300 కోట్ల ఎమ్మెల్యే బిచ్చగాడయ్యాడు

2015లో పోలీసులు దీనిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయగా.. దాదాపు 11ఏళ్ల తర్వాత ఇటీవల కోర్టుకు నివేదిక సమర్పించారు. మరోవైపు, ఈ వ్యవహారానికి సంబంధించి గతేడాది ఆ రెండు సంస్థలు.. వోహ్రాపై పోలీసులకు ఫిర్యాదు చేశాయి. దీంతో మనస్తాపానికి గురైన అస్గర్‌అలీ వోహ్రా.. సెప్టెంబరు 8న ప్రధాని మోదీని కలిసి తన ఆవేదనను విన్నవించుకున్నారు. ఈ వ్యవహారంలో సీబీఐ దర్యాప్తు జరిగేలా చూడాలని అభ్యర్థించారు. కాగా.. సెప్టెంబరు 16న ఈ కేసుపై మున్సిపల్ కార్పొరేషన్‌లో విచారణ జరగాల్సి ఉంది. ఆ లోగానే కేసు పరిష్కారమైనట్లు తెలిసింది. వోహ్రాతో భూవివాదం నుంచి ఆ రెండు సంస్థలు వెనక్కి తగ్గాయి. ఆయనకు భూమిని తిరిగిచ్చేందుకు అంగీకరించడంతో పాటు కేసును ఉపసంహరించుకున్నాయి. గుజరాత్‌లోని వాడ్‌నగర్‌లో గల బీఎన్ స్కూల్‌లో వోహ్రా చదువుకున్నారు. ఇదే పాఠశాలలో మోదీ కూడా విద్యనభ్యసించారు.

## కొందరు కొల్లగొట్టిన వేల ఎకరాల వివరాలు సభ ముందుంచుతా: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: 22ఏతో ప్రభుత్వం వేధిస్తోందని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారని.. అది నిజం కాదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో సీఎం మాట్లాడారు. ప్రతిపక్షాల ఆరోపణలు నిజం కాదని చెప్పేందుకే ఈ అంశంపై చర్చ చేపట్టామన్నారు. ప్రధాన సమస్యలపై చర్చ నుంచి తప్పించుకునేందుకే విపక్షం యత్నిస్తోందన్నారు. చర్చ జరిగితే 22ఏ విషయంలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవకతవకలు బయటపడతాయని భావించే పక్కదోవ పట్టిస్తున్నారన్నారు.

"భూముల సమస్య వారసత్వంగా ఎలా వచ్చిందనే దానిపై చర్చ జరగాలి. నిజాం సర్కారు, ఉమ్మడి రాష్ట్రంలోని సమస్యలు, 22ఏ జాబితా సమస్యలు, కోర్టుల తీర్పులు వంటి అంశాలపై చర్చ చేపట్టాలి. కొందరు కొల్లగొట్టిన వేల ఎకరాల వివరాలను సభ ముందు ఉంచుతా. ధరణి పేరిట దోపిడీ జరిగి రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారింది. నిషేధిత భూముల సమస్యను మరింత జటిలం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సృష్టించిన భూతం అందరినీ మింగేస్తుందని ఆయనపై కక్షాపూరిత ఆలోచనతో అబద్ధాలు ప్రచారం చేశారు. శ్రీనివాస్‌రెడ్డిది ఎంత బాధ్యతో ప్రభుత్వానిదీ అంతే బాధ్యత. ఈ సమస్యపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాలి. సభ్యులు సూచన చేస్తే పేదలను ఆదుకునేందుకు మంచి నిర్ణయం తీసుకోవచ్చు. ప్రభుత్వ ప్రతిపాదిత అంశాలను పరిశీలించి సలహాలు సూచనలు ఇవ్వాలి" అని రేవంత్ కోరారు.

### ఆ నిబంధనలే అమలు చేస్తున్నాం

అసెంబ్లీ వద్ద పోలీసులు, మహిళలను కించపరిచేలా బీఆర్ఎస్ నేతలు వ్యవహరించారని సీఎం విమర్శించారు. అర్ధనగ్న ప్రదర్శనలతో పోలీసులను దూషించారని.. స్పీకర్‌ను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడారన్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సభ్యులను సమావేశాల నుంచి స్పీకర్ బహిష్కరించారని చెప్పారు. సభ నిర్వహణపై గత ప్రభుత్వం కమిటీని నియమించి నిబంధనలు పెట్టిందన్నారు. సభలో ప్లకార్డులు, నినాదాలు ఉన్న ఫ్లెక్సీలు, దుస్తులతో రావొద్దని నిబంధనలు పెట్టారని... వాటినే అమలు చేయాలని అసెంబ్లీ సెక్రటరీ ద్వారా స్పీకర్ పోలీసులను ఆదేశించారని చెప్పారు. ఆ ఆదేశాలనే పోలీసులు అమలు చేస్తున్నారన్నారు.

## ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలు బయటకు తీయాలి:

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కమ్యూనిస్టులు లేకుండా భూపోరాటాలు ఎక్కడా జరగలేదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 1945 నుంచే కమ్యూనిస్టులు పోరాటం చేస్తున్నారని చెప్పారు. ధరణిలో జరిగిన తప్పిదాలతో ప్రజలకు చాలా నష్టం జరిగిందన్నారు. 3 లక్షల ఎకరాల ప్రైవేటు భూముల వివరాలను బయటకు తీయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో నిర్వహించిన చర్చలో కూనంనేని మాట్లాడారు.

హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలను వెల్లడించాలన్నారు. భూదాన్ భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించే అంశాన్ని ఆలోచించాలని ప్రభుత్వానికి సూచించారు. నిజాం హయాంలో సర్ఫ్‌ఖాన్ పేరిట హైదరాబాద్‌లో ఉన్న భూములు ఇప్పుడు ఎక్కడని ప్రశ్నించారు. వాటిని బయటకు తీస్తే స్థలం లేని అందరికీ ఇవ్వొచ్చన్నారు. 22ఏ విషయంలో జరిగింది సాంకేతిక తప్పిదంగా భావిస్తున్నట్లు తెలిపారు. దీనిలో మంత్రులు, అధికారుల పాత్ర ఎంత ఉందో తేల్చాలన్నారు.

## గురుకులాల పనివేళలపై వివరణివ్వండి: హైకోర్టు



మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనివేళల మార్పుతోపాటు ఉపాధ్యాయులకు బోధనేతర విధులు అప్పగించడంపై వివరణివ్వాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. 2024లో ప్రభుత్వం జారీ చేసిన జీవో 16, అదేవిధంగా పనివేళలు మారుస్తూ ఈ ఏడాది జూన్‌లో జారీ చేసిన ప్రొసీడింగ్స్‌లో గురుకులాలను చేర్చాలని కోరుతూ ఎం.సిప్లీ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డిలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. గురుకులాల పాఠశాలల పనివేళలు ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉన్నాయని, దీన్ని ఉదయం 9 నుంచి 4.30 వరకు ఉండేలా సవరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఉపాధ్యాయులకు స్టడీ అవర్, వార్డెన్, హాస్టల్ ఇన్‌ఛార్జి వంటి అదనపు విధులు అప్పగించరాదని ఆదేశించాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం ప్రభుత్వ వివరణ కోరుతూ విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది.

# భూముల రీ సర్వే ప్రక్రియపై అవగాహన...

- భూముల వివరాలు క్షేత్రస్థాయిలో పక్కాగా సేకరించాలి
- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

వీర్నపల్లి సెప్టెంబర్ 16 ప్రజాతివాసి

భూముల రీసర్వే ప్రక్రియ తదితర అంశాలపై వీర్నపల్లి మండలం కేంద్రంలోనీ రైతు వేదికలో భూముల రీ సర్వే పై బుధ వారం గ్రామసభ నిర్వహించారు. దానికి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. భూముల వివరాలను క్షేత్ర స్థాయిలో పక్కాగా సేకరించాలని, రోజూ వారీగా లక్ష్యం నిర్దేశించుకుని, రీ సర్వే పూర్తి



పారదర్శకతతో చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో సర్వే చేసే ముందు జీపీఓలు, ఏఈఓలు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఏ ఏ సర్వే నంబర్ భూముల సమాచారం చేరవేయాలని ఆదేశించారు. గ్రామ సరిహద్దుల రీ సర్వే, ఇతర పనులను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. సర్వే పై ఎలాంటి అపోహలు వద్దని, రైతులు సర్వేకు పూర్తిస్థాయిలో సహకరించాలని తెలిపారు. అలాగే ఆరుతడి పంటల పై దృష్టి సారించి ఆయిల్ ఫామ్ సాగు, పెసర, కందులు, బబ్బర్లు పప్పు ధాన్యాల పండించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు మల్లారపు జ్యోత్స్న అరుణ్ కుమార్, రమేష్,ఏ ఎం సి చైర్మన్ రాములు నాయక్,ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, డి ఐ వెంకట చారి,డిప్యూటీ తహసీల్దార్ పావని , అర్ ఐ లు శివ కుమార్, మహమ్మద్ ఉమెర్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో విశేషంగా మహా గణపతి హోమం

వేములవాడ /సెప్టెంబర్ 16 ప్రజాదివాస్



వేములవాడ పట్టణంలోని శ్రీసాయి గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూడో రోజు మహా గణపతి హోమాన్ని అర్చకులు సుమన్ శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదాలను స్వీకరించారు. ప్రతి ఏడాది గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తి భావంతో నిర్వహిస్తున్నామని మండప నిర్వాహకులు తెలిపారు.గణేష్ నవరాత్రి సందర్భంగా నిర్వహించే పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు విఘ్నేశ్వరుడు సకల శుభాలను ప్రసాదిస్తాడని పేర్కొన్నారు. ఈ ఏడాది సమితి ఆధ్వర్యంలో 9వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

# పోషణ మాసాన్ని పకడ్బందీగా నిర్వహించాలి ,ప్రతి నెలా పిల్లల ఎత్తు, బరువు నమోదు చేయాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్
- సామ్, మామ్, ఎస్‌యూడబ్ల్యూ పిల్లలపై ప్రత్యేక దృష్టి
- మెనూ ప్రకారం వేడి వేడి నాణ్యమైన భోజనం అందించాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 16 ప్రజాదివాస్

జిల్లాలో పోషణ మాసం కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. పోషణ అభియాన్‌లో భాగంగా ఈ నెల 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహించనున్న కార్యక్రమాలపై బుధవారం ఐడీఓసీలో వివిధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 9వ జాతీయ పోషణ మాసం పోస్టర్‌ను ఆవిష్కరించారు.అంగన్వాడీ కేంద్రాల్లో లైట్లు, ఫ్యాన్లు, ఆర్ఓ వాటర్ వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నెలా పిల్లల ఎత్తు, బరువును తప్పనిసరిగా నమోదు చేసి అంగన్వాడీ యాప్‌లో వివరాలు పొందుపరచాలన్నారు.సామ్, మామ్, ఎస్‌యూడబ్ల్యూ పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంగన్వాడీ సూపర్‌వైజర్లు వారి ఇళ్లకు వెళ్లి పోషకాహారం, సంరక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైన వారికి బాలామృతం, బాలామృతం ప్లస్ అందించడంతో పాటు ఎదుగుదల లోపాలు ఉన్న పిల్లలను డీఈఐసీ కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు.పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి అదనపు పోషకాహారం అందించాలని, వైద్య శాఖ సమన్వయంతో వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన, వేడి భోజనం అందించాలని స్పష్టం చేశారు.ఈ నెల 21న అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనేలా చూడాలని సూచించారు. గ్రామాల్లో



పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డుల్లో వార్డు అధికారులు అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు.సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, డీఏఓ అఫ్జల్ బేగం, డీసీఎస్ఓ డీఎం గోపాల్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# మానేరు కరకట్ట పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ గరిమ అగర్వాల్

- సిరిసిల్ల మానేరు తీరంలో కొనసాగుతున్న పనులపై క్షేత్రస్థాయి పరిశీలన
- అధికారులకు పర్యవేక్షణ పెంచాలని ఆదేశాలు



రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 16 ప్రజాదివాస్

సిరిసిల్ల మానేరు నది తీరంలో కొనసాగుతున్న కరకట్ట నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.బుధవారం తంగళ్లపల్లి వంతెన నుంచి సుమారు మూడు కిలోమీటర్ల మేర సాగుతున్న కరకట్ట పనులను కలెక్టర్ నీటి పారుదల శాఖ, మున్సిపల్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కరకట్ట పనులను నీటి పారుదల శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో ఆర్డీఓ శ్రీధర్ బాబు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# దుబాయ్‌లో తంగళ్లపల్లి వాసి అనారోగ్యంతో మృతి

- ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి వారంలోనే ప్రాణాలు కోల్పోయిన వల్లేపు రవి
- శోకసంద్రంలో మునిగిపోయిన మృతుడి కుటుంబ సభ్యులు
- స్వగ్రామానికి భౌతికకాయం తరలింపునకు ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి

తంగళ్లపల్లి మండలం / సెప్టెంబర్ 16 ప్రజాదివాస్

తంగళ్లపల్లి మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఉపాధి కోసం గల్ఫ్ దేశం వెళ్లిన ఓ యువకుడు అనారోగ్యంతో అక్కడే మృతి చెందడంతో స్థానికంగా విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు



తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన వల్లేపు రవి (40) కుటుంబ పోషణ నిమిత్తం ఈ నెల 10వ తేదీన ఉపాధి కోసం దుబాయ్‌లోని అబుదాబికి వెళ్లారు. అక్కడకు చేరుకున్న కొద్ది రోజులకే తీవ్ర అనారోగ్యానికి గురై, ఈ నెల 15వ తేదీన చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఉపాధి లభించి కుటుంబం ఆర్థికంగా స్థిరపడుతుందనుకున్న సమయంలో వారం తిరగకుండానే రవి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు రవికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న రవి హఠాన్మరణంతో ఆ కుటుంబం ఒక్కసారిగా వీధిన పడింది. తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయిన బాధిత కుటుంబాన్ని చూసి గ్రామస్తులు చలించిపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి భారత రాయబార కార్యాలయం ద్వారా రవి భౌతికకాయాన్ని త్వరితగతిన స్వగ్రామానికి రప్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే నిరుపేద కుటుంబానికి ఆర్థికంగా చేయూతనిచ్చి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# దివ్యాంగ విద్యార్థుల మండల స్థాయి ఆటల పోటీలు

ముస్తాబాద్/ సెప్టెంబర్ 16 ప్రజా దివాస్




రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాదు మండలంలోని ఎం ఆర్ సి ఆవరణలో బుధవారం రోజున దివ్యాంగ విద్యార్థిని విద్యార్థులకు ప్రాథమిక స్థాయి మరియు సెకండరీ స్థాయి స్థాయిలో,1పరుగు పందెం 2. మ్యూజికల్ చైర్ 3. కవర్ రింగ్ 4. డ్రాయింగ్5.డ్యాన్సింగ్ ఆటలు నిర్వహించడం జరిగింది గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాధికారీ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముస్తాబాదు మండల విద్యాధికారి అంబటి రవీందర్ ఐ.ఇ.ఆర్.పి,గౌతమి, విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎం ఆర్ సి సిబ్బంది శ్రీకాంత్ రెడ్డి రాజేందర్,రమణ దేవి, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 28న సిరిసిల్ల అంబేడ్కర్ చౌక్‌లో ‘ముదిరాజ్ ఆత్మగౌరవ సింహగర్జన’

- ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి చేర్చాలి: ముదిరాజ్ సంక్షేమ సంఘం డిమాండ్

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 16 ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ నెల 28వ తేదీన చేపట్టనున్న ముదిరాజ్ ఆత్మగౌరవ సింహగర్జన కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ముదిరాజులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను మూడేళ్లు గడుస్తున్నా అమలు చేయకపోవడానికి నిరసనగా, తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సిరిసిల్ల అంబేద్కర్ చౌక్‌లో ఈ భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా ప్రతినిధులు మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ముదిరాజులను బీసీ–డీ కేటగిరీ నుంచి బీసీ–ఏ కేటగిరీలోకి మార్చాలని, గతంలో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తమ వర్గానికి జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ నిర్వహిస్తున్న ఈ ఆత్మగౌరవ సింహగర్జన సభకు జిల్లా నలుమూలల నుంచి ముదిరాజులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ముదిరాజ్ సంక్షేమ సంఘం నాయకులు డీఎస్పీ నాగేంద్రాచారి, పట్టణ సీఐ శ్రీనివాస్‌లను కలిసి ఆత్మగౌరవ సింహగర్జన కార్యక్రమ నిర్వహణకు అవసరమైన పోలీసు అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, నాయకులు కోడి అంతయ్య, పర్ష హనుమండ్లు, వంకాయల కార్తీక్, ఫిషరీస్ చైర్మన్




చొప్పరి రామచంద్రం, పర్ష రాములు, రాయిని ప్రతాప్, పసుల తిరుపతి, కొనరావుపేట సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భీమేశ్వరస్వామి హుండీ ఆదాయం 1.91 కోట్లు

వేములవాడ / సెప్టెంబర్ 16 ప్రజాదివాస్



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా చేపట్టిన హుండీ లెక్కింపులో భారీ ఆదాయం సమకూరింది. గత 28 రోజులకు సంబంధించి నిర్వహించిన మొదటి రోజు కౌంటింగ్‌లో ?1,91,64,681 నగదుతో పాటు 119 గ్రాముల 500 మిల్లీగ్రాముల మిశ్రమ బంగారం, 9 కిలోల 800 గ్రాముల మిశ్రమ వెండి కానుకలుగా వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ లెక్కింపు ప్రక్రియను ఆలయ ఈవో రమాదేవి, కరీంనగర్ దేవాదాయ శాఖ ఏసీ కార్యాలయ పరిశీలకులు రాజమౌళి, డీఈవో నవీన్ కుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారులు, ఆలయ సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, శ్రీ రాజరాజేశ్వరి సేవా సమితి సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు. హుండీ లెక్కింపు ప్రక్రియ రెండో రోజు కూడా కొనసాగనుందని ఆలయ పీఆర్వో పెరిక శ్రీనివాస్ తెలిపారు.



# నూతన అధ్యక్షుడు గోపు రమేష్ పటేల్‌కు శుభాకాంక్షలు తెలిపిన చెన్నమనేని వికాస్ రావు

వేములవాడ / సెప్టెంబర్ 16 ప్రజాదివాస్

వేములవాడ గ్రామీణ మండలం పోచెట్టిపల్లి గ్రామంలో మున్నూరుకాపు యువత ఆధ్వర్యంలో కొలువుదీరిన శ్రీ గణేష్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గోపు రమేష్ పటేల్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు హాజరై, నూతన అధ్యక్షుడిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వికాస్ రావు మాట్లాడుతూ.. యువత అంతా ఐక్యమత్యంతో ముందుకు సాగుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో నిరంతరం చురుగ్గా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం గ్రామంలోని మున్నూరుకాపు యువతను సమాయత్తం చేస్తూ సంఘం అభివృద్ధికి, సామాజిక శ్రేయస్సుకు విశేషంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అల్లాడి రమేష్, మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేశ్, మండల ప్రధాన కార్యదర్శి తోట శేఖర్, మండల అధికార ప్రతినిధి సుంకరి నరేందర్, బూత్ అధ్యక్షుడు సాగర్ల నరేష్, సీనియర్ నాయకులు చెట్టిపల్లి రవికిషోర్, ఆకుల బాబు, బిళ్ళ కృష్ణతో పాటు పలువురు బీజేపీ నాయకులు, గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పశు వైద్య భవనానికి మరమ్మత్తులు చేపట్టాలి







- ఊడి పడుతున్న పెచ్చులు భయాందోళనలో సిబ్బంది

ముస్తాబాద్, సెప్టెంబర్ 16 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరువైంది వర్షం పడితే చాలు భవనం స్లాబ్ లీకై పై పెచ్చులు ఊడి పడుతున్నాయి. గోడలన్నీ తడిచిపోయి గదుల్లో ఉన్న విలువైన మందులు పాడవుతున్నాయి. వర్షం వచ్చిందంటే చాలు సిమెంట్ పెచ్చులు ఊడి తమ మీద పడతాయని సిబ్బంది భయపడుతున్నారు. భవనం వెనుక డోర్ పూర్తిగా ధ్వంసం అయింది. తలుపులు విరిగి పోవడం వలన అందులో నుండి కోతులు వచ్చి మందుల సామాగ్రి చిందర వందర చేస్తున్నాయని సిబ్బంది తెలిపారు. ఎలుకలు, పాములు కూడా వస్తాయని వెంటనే సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మరమ్మతులు చేయించాలని రైతులు పేర్కొన్నారు.

# కాటన్ చీరల కూలీ పెంచని యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: సీఐటీయూ

- సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట కార్మికులు, ఆసాముల ధర్నా ఏఓకు వినతిపత్రం అందజేత

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 16 ప్రజాదివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాటన్ చీరల కూలీ పెంచకుండా కార్మికులు, ఆసాములను శ్రమదోపిడీకి గురిచేస్తున్న పవర్లూమ్ యజమానులపై జిల్లా కలెక్టర్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు కార్మికులు, ఆసాములు భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ)కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోడం రమణ మరియు నాయకులు మాట్లాడుతూ.. సిరిసిల్లలో చేనేత సహకార చట్టం 1985ను ఉల్లంఘించి కొంతమంది యజమానులు పవర్లూమ్‌లపై కాటన్ చీరలను ఉత్పత్తి చేయిస్తున్నారని తెలిపారు. వారి వద్ద పనిచేస్తున్న కార్మికులకు, ఆసాములకు తక్కువ కూలీ చెల్లిస్తూ వారిని తీవ్ర శ్రమదోపిడీకి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీ పెంచాలని డిమాండ్ చేస్తూ గత 15 రోజులుగా కాటన్ చీరల ఉత్పత్తిని బంద్ చేసి కార్మికులు, ఆసాములు సమ్మె చేస్తున్నప్పటికీ, యజమానులు కూలీ పెంచడానికి ముందుకు రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కావున చట్టాన్ని ఉల్లంఘిస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్న యజమానులపై కలెక్టర్ గారు వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోడం రమణ, యూనియన్ నాయకులు ఓడ్నాల వీరేశం, నల్ల మార్కండేయ, చిరంజీవి, బాలరాజు, రవీందర్, గోపాల్, కనకయ్య, నాగరాజు, హనుమాన్లు, జగదీష్, రాజు, కిరణ్, నరసయ్య, వెంకటేశంలతో పాటు కాటన్ చీరలు నడిపించే కార్మికులు, ఆసాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నైజాం నిరంకుశత్వాన్ని తరిమికొట్టిన ఘనత కమ్యూనిస్టులదే: సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్

- వేములవాడలో ఘనంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు
- కామ్రేడ్ గుమ్మి పుల్లయ్య స్తూపం వద్ద కడారి రాములు ఆధ్వర్యంలో నివాళులు

వేములవాడ / సెప్టెంబర్ 16 ప్రజాదివాస్

వేములవాడ పట్టణంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు బుధవారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. వారోత్సవాల్లో భాగంగా సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి కామ్రేడ్ కడారి రాములు ఆధ్వర్యంలో స్థానిక కామ్రేడ్ గుమ్మి పుల్లయ్య స్తూపం వద్ద ఆయనకు విప్లవ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నైజాం నిరంకుశ సర్కారును తరిమికొట్టి, పేదలకు వేల ఎకరాల భూములను పంచిపెట్టిన ఘన చరిత్ర సీపీఐ పార్టీదేనని ఆయన ఉద్ఘాటించారు. రైతులు, సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడే ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని స్పష్టం చేశారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలోని మర్రిపల్లి, తిప్పాపూర్, నాంపల్లి పల్లగుట్ట ప్రాంతాల్లో రద్దు చేసిన రైతు పట్టాలను తిరిగి వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే మరిమడ్ల కొండం చెరువులో 80 ఎకరాల పోడు భూములతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల భూములకు తక్షణమే పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారుకేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కమ్యూనిస్ట్ పార్టీలపై తీవ్ర అణచివేత చర్యలకు పాల్పడుతోందని సుదర్శన్ తీవ్రంగా మండిపడ్డారు. ఒకవైపు దొడ్డి కొమురయ్య స్తూపం వద్ద నివాళులర్పిస్తూనే, మరోవైపు కమ్యూనిస్టులను నక్సలైట్లు, అర్బన్ నక్సలైట్లు అని ముద్రవేస్తూ ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు తప్పుడు మార్గంలో పయనిస్తోందని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ నెరవేరలేదని, నల్లధనం వెలికితీత, బ్యాంకు ప్రైవేటీకరణ, నిత్యావసరాలపై జీఎస్టీ విధింపు, పంటలకు మద్దతు ధర లేకపోవడమే బీజేపీ పాలకుల వైఫల్యానికి నిదర్శనమన్నారు. కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని,



ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వేములవాడలో రోడ్లు, కూరగాయల మార్కెట్, ఆలయ ప్రాంగణం మరియు గుడి చెరువు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని వేగంగా పూర్తి చేయాలని, గుడి ముందరి దుకాణదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుమ్మి పుల్లయ్య వారసులు గుమ్మి పవన్, మధు, మహేష్‌లు పాల్గొని నివాళులర్పించారు. సీపీఐ నాయకులు గాజుల పోశెట్టి, కె.వి. అనసూయ, పందుల మల్లేశం, కోరేపు క్రాంతి, కోకాపెల్లి శాంత, కిరణ్, చంద్రన్న తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వహించాలి

-- సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి సూచనం

-- నిమజ్జన ఏర్పాట్లపై సమన్వయ సమావేశం



రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 16 ప్రజాదివాస్

గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో వైభవంగా నిర్వహించుకోవాలని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిరిసిల్ల పట్టణంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో వివిధ శాఖల అధికారులు, గణేష్ మండపాల నిర్వాహకులు, పీస్ కమిటీ సభ్యులు, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ, ఉత్సవాల నిర్వహణలో పోలీసుల సూచనలు పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. నిమజ్జనం రోజున మండపాల నుంచి నేరుగా నిర్దేశిత నిమజ్జన కేంద్రాలకు వెళ్లి, నిర్ణీత సమయాల్లో నిమజ్జనం పూర్తి చేయాలని సూచించారు. మండపాల వద్ద, నిమజ్జన సమయంలో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సిరిసిల్ల ఆర్డీవో శ్రీధర్ బాబు మాట్లాడుతూ, అన్ని శాఖల సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా మాట్లాడుతూ, నిమజ్జన కేంద్రాల వద్ద క్రేన్లు, జేసీబీలు, విద్యుత్ దీపాలు, తాగునీటి సదుపాయం తదితర ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు మండపాలు, ఊరేగింపు మార్గాల్లో విద్యుత్ తీగలను ఎత్తు పెంచి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిమజ్జన కేంద్రాల వద్ద 24 గంటల అంబులెన్స్ సేవలు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, అత్యవసర వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో సీఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, ఫైర్, వైద్య, విద్యుత్ శాఖల అధికారులు, ఎస్ఐలు, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# కోరుట్లలో దారుణం.. అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి దారుణ హత్య

--కుటుంబ కలహాలే కారణం.. మెడకు చున్నీ బిగించి చంపేసిన భర్త

జగిత్యాల జిల్లా / సెప్టెంబర్ 16 ప్రజాదివాస్



జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో బుధవారం దారుణం చోటుచేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా ఓ అంగన్‌వాడీ కార్యకర్తను ఆమె భర్తే దారుణంగా హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని ప్రకాశం రోడ్డులో నివాసముంటున్న అన్నం నరేష్, లక్ష్మి ఒపతుల మధ్య గత కొంతకాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. నరేష్ కథలాపూర్ సబ్‌స్టేషన్‌లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తుండగా, లక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం వీరిద్దరి మధ్య మరోసారి తీవ్రస్థాయిలో వాగ్వాదం చెలరేగింది. గొడవ తారాస్థాయికి చేరడంతో తీవ్ర ఆగ్రహానికి, క్షణికావేశానికి లోనైన నరేష్ భార్య లక్ష్మి మెడకు చున్నీని గట్టిగా బిగించి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. అనంతరం ఘటన స్థలం నుంచి నిందితుడు పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని, పరారీలో ఉన్న నిందితుడు నరేష్ కోసం గాలింపు చర్యలు వేగవంతం చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## టెలికాం సేవల విస్తరణకు సమన్వయంతో ముందుకు సాగాలి: అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

– ఐడీఓసీలో జిల్లా స్థాయి టెలికాం కమిటీ (డీఎల్టీసీ) సమావేశం నిర్వహణ

రాజన్న సిరిసిల్ల జిల్లా / సెప్టెంబర్ 16 ప్రజాదివాస్



జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో జిల్లా స్థాయి టెలికాం కమిటీ (డీఎల్టీసీ) సమావేశాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ భారత్ నిధి (డీబీఎన్), ఫారెస్ట్ రైట్స్ గుర్తింపు, టెలికాం టవర్లకు విద్యుత్ సరఫరా, భారత్‌నెట్ మౌలిక సదుపాయాలు, 'కాల్ బిఫోర్ యూ డిగ్' మొబైల్ యాప్ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో టీ-ఫైబర్, బీఎస్ఎన్ఎల్ అధికారులకు ముందస్తుగా సమాచారం అందించాలని సంబంధిత శాఖల అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. అభివృద్ధి పనులతో టెలికాం సేవలకు అంతరాయం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ, ఈడీఎం శ్రీనివాస్, టీ-ఫైబర్, బీఎస్ఎన్ఎల్ అధికారులు తథా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అందరిపై విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఉండాలి: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



వేములవాడ / సెప్టెంబర్ 16 ప్రజాదివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని శ్రీ సాయి గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం మండప నిర్వాహకులు ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ, వినాయకుని కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## వేములవాడలో పోషణ్ మాసం కార్యక్రమం.. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార అవగాహన

-- పోషకాలున్న ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం: సూపర్ వైజర్ అంజమ్మ

-- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహార ప్రాధాన్యతపై అవగాహన

-- 14వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా వంటల ప్రదర్శన

వేములవాడ / సెప్టెంబర్ 16 ప్రజాదివాస్



వేములవాడ పట్టణంలోని 14వ వార్డు మూలవాగు కాలనీ-2 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'పోషణ్ మాసం' వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ సౌందర్య, సూపర్ వైజర్ అంజమ్మల ఆదేశాల మేరకు ఈ పౌష్టికాహార అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అంగన్‌వాడీ సిబ్బంది మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పోషక విలువలు కలిగిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు మరియు పప్పుధాన్యాలు తీసుకోవడం వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు మరియు 6 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లల తల్లులు ఆహారంలో తగినన్ని పోషకాలు ఉండేలా జాగ్రత్తలు వహించాలని అవగాహన కల్పించారు. అనంతరం పోషక విలువలతో కూడిన పదార్థాలతో వంటల ప్రదర్శనను నిర్వహించి చూపించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ దాసరి శారద, ఆయా గొర్రె ధనలక్ష్మి, ఆశా వర్కర్ బండి లత, గర్భిణులు, బాలింతలు, తల్లులు, పిల్లలు మరియు కిశోర బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ వైఫల్యం జోగిపేటకు మళ్లీ పూర్వ వైభవం

- బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి నిర్లక్ష్యం...
- కాంగ్రెస్ పాలనలో జోగిపేటకు మళ్లీ పూర్వ వైభవం!
- 80 కోట్లతో మంజీరా నదిపై వంతెనతో కూడిన రోడ్డు నిర్మాణం!

ప్రజాదివాస్

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాల ప్రభావంతో జోగిపేట పట్టణం తన పాత వ్యాపార ప్రాభవాన్ని కోల్పోయింది.
చీ–161 రహదారి బైపాస్ కారణంగా పట్టణంలో రాకపోకలు, వ్యాపార కార్యకలాపాలు తగ్గాయని మంత్రి దామోదర రాజనరసింహ గారు గతంలో పేర్కొన్నారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది...! మంత్రి దామోదర రాజనరసింహ గారి ఆలోచనతో...సంగారెడ్డి మెదక్ జిల్లాలను కలుపుతూ మంజీరా నదిపై 80 కోట్లతో వంతెనతో కూడిన రోడ్డు నిర్మాణం. అజ్జమర్రి హైలెవెల్ బ్రిడ్జ్ అభివృద్ధికి కొత్త బాటలు! ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే సుమారు 20 గ్రామాల ప్రజలకు జోగిపేటతో రాకపోకలు మెరుగుపడే అవకాశం ఉంది.

**జోగిపేటకు రానున్న మార్పులు:**

పట్టణానికి ప్రజల రాకపోకలు పెరిగే అవకాశం. వ్యాపార కార్యకలాపాలకు కొత్త అవకాశాలు. పరిసర గ్రామాలకు మెరుగైన అనుసంధానం. పట్టణ అభివృద్ధికి కొత్త ఊపిరి. బీఆర్ఎస్ పాలనలో కోల్పోయిన ప్రాభవం...కాంగ్రెస్ పాలనలో తిరిగి సాధించే దిశగా అడుగులు! ఒకప్పుడు ప్రజలతో కళకళలాడిన జోగిపేట పట్టణానికి మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలనే లక్ష్యంతో అభివృద్ధి




పనులు కొనసాగుతున్నాయి. గత పాలనలో ఎదురైన సమస్యలకు పరిష్కారం చూపుతూ...ప్రజల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ గారి ఆలోచన! జోగిపేట అభివృద్ధి కోసం...ప్రజల సంక్షేమం కోసం...మంజీరా వంతెనతో మరో ముందడుగు!

# చొల్లేటి భారతమ్మకు నివాళు లర్పించిన ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

- హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

ప్రజాదివాస్



సంగెం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు,సీనియర్ నాయకుడు చొల్లేటి మాధవరెడ్డి మాతృమూర్తి చొల్లేటి భారతమ్మ అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కాట్రపల్లిలోని వారి నివాసానికి చేరుకుని, భారతమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాధవరెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, సర్పంచులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తక్షణమే రాజీనామాకు సిద్ధం ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

ప్రజాదివాస్



తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు బుధవారం నాడు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా ఆర్మూర్ లో శిథిలావస్థలో ఉన్న రెవెన్యూ కార్యాలయాల గురించి అడుగుతున్న పట్టించుకునే నాధుడే లేడని అవసరమైతే రాజీనామా కూడా చేస్తానని మంత్రులు సీఎం వారి నియోజకవర్గాలకు నిధులు ఎలా కేటాయిస్తున్నారో అన్ని తమ వద్ద ఉన్నాయని మాకు కూడా కొంత మేర నిధులు కేటాయించి ప్రభుత్వ కార్యాలయాలు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆర్మూర్ పై దయ చూపాలని 27 కోట్లు రెవెన్యూ కార్యాలయం కోసం మంజూరు చేయాలని లేనిపక్షంలో తక్షణమే రాజీనామా చేయడానికి కూడా సిద్ధమని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తెలిపారు.

# తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో పోరాటాలు ఉధృతం చేయాలి

- సూడి కృష్ణారెడ్డి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్,ఎస్

ప్రజాదివాస్

తాడ్వాయి తాడ్వాయి మండలంలోని పడిగాపూర్ గ్రామంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దుగ్గి చిరంజీవి అధ్యక్షతన తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించడం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా సూడి కృష్ణారెడ్డి గారు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం భూమి కొరకు భుక్తి కొరకు వెట్టిచాకిరి విముక్తి కొరకు 1946 నుండి19 51 వరకు పేద ప్రజలు సాగించిన పోరాటమని ఇది భూస్వాములకు రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన సుదీర్ఘ పోరాటమని ఈ పోరాటంలో పది లక్షల ఎకరాల భూమి పేద ప్రజలకు పంచిందని 3000 గ్రామాలను విముక్తి చేసి గ్రామ స్వరాజ్యాలు ఏర్పడ్డాయని ఈ పోరాటంలో 4,000 మంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు అమరులయ్యారని పేర్కొన్నారు






ఇలాంటి పోరాటాన్ని ఈ పోరాటంలో ఎలాంటి సంబంధం లేని బిజెపి ఈరోజు వక్రీకరించి నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా అంటే ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులు చేసిన పోరాటంగా అభివర్ణించి మత ప్రాతిపదిక మీద ఈ పోరాటాన్ని విమోచన దినంగా పేర్కొంటున్నది పాలక పార్టీలు ఈ పోరాటాన్ని విలీన దినంగా పాటిస్తున్నారు కమ్యూనిస్టులు మాత్రమే ఈ పోరాటాన్ని అమరవీల స్ఫూర్తితో వార్షికోత్సవ సభలు నిర్వహిస్తున్నారు పేర్కొన్నారు ఈ పోరాటంలో హిందూ భూస్వాములకు వ్యతిరేకంగా షేక్ బందగి మొయినుద్దీన్ లాంటి ముస్లింలు కూడా పాల్గొన్నారు అని ఇది కేవలం వెట్టిచాకిరికి భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమని పేర్కొన్నారు నేటికీ పాలకులు స్వతంత్రం వచ్చి 79 సంవత్సరాల పూర్తయిన పేదలకు భూమి పంచలేదని 2005 అటవీ యొక్క చట్టం అమలు కొరకు పోరాటాలు నిర్వహించామని ఇంకా జిల్లాలో వేలాది మందికి హక్కు పత్రాలు రాలేదని ఈ ప్రభుత్వం అందరికీ హక్కులు కల్పిస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసిందని పేర్కొన్నారు హక్కు పత్రాలు వచ్చేదాకా పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సిన అవసరం ఉన్నది. కౌలుదారులకు రక్షణ లేదని దేశంలో మహిళలకు రక్షణ లేదని పేర్కొన్నారు అందుకే సిపిఎం పార్టీ కార్యకర్తలు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటస్ఫూర్తితో ప్రతి కార్యకర్త పోరాటాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి రెడ్డి సాంబశివ సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు పొదిల్ల చిట్టిబాబు సిపిఎం జిల్లా కార్యదర్శివక సభ్యుల సోమమల్లారెడ్డి అల్లెం అశోక్ ఉ కే ప్రభాకర్ అంబాల మురళి కురసంశ్యామ్ తదితరులు పాల్గొన్నారు

# హౌసింగ్ బోర్డ్ కాలనీ పార్కింగ్ లో కోతుల బెడద

ప్రజాదివాస్



ఈరోజు హౌసింగ్ బోర్డులో కోతులు బెడద చాలా విపరీతంగా ఉంది కాలనీవాసులు చాలా ఇబ్బంది పడుతున్నారు కోతులు ఎవరిని చూడక ప్రజలపై దాడి చేసి కొరకడం చేస్తున్నారు. పార్కింగ్ ఏరియాలో విపరీతంగా ప్రజలకు ఇబ్బందిగా ఉంటుంది ఉదయాన్నే మరియు సాయంత్రం ప్రజలకు పార్కింగ్ వెళ్లాలన్న భయపడుతున్నారు ఆర్మూర్ కమిషనర్ శ్రద్ధ చూపగలరు జెస్సు దత్తాత్రి మాజీ వార్డ్ సభ్యులు కు కోతులు ఉదయమే విపరీతంగా కొరకడం దాడి చేశాయి కోతులు వెంటనే కమిషనర్ స్పందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# యూపీఐ చెల్లింపులపై టాక్స్ వేసే యత్నం ను నిరశిస్తూ 17,18, న నిరసనలు విజయవంతం చేయండి

- పి వై ఎల్ జిల్లా అధ్యక్షులు ఏరుకొండ ప్రవీణ్

ప్రజాదివాస్

బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అని తెచ్చిన జిఎస్టి, యూపీఐ చెల్లింపుల మీద పన్ను వేసి , ప్రజల పై భారం వేస్తున్న విధానాన్ని సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ తీవ్రంగా ఖండిస్తున్నదనీ, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఏరుకొండ ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిఎస్టి పేరుతో ఇప్పటికే ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారాన్నారు నేడు సాధారణ ప్రజలనందరిని యూపీఐ చెల్లింపులకు అలవాటు చేసి నేడు టాక్స్ వేసే యత్నం అత్యంత మోసపూరిత చర్య అని అన్నారు. అమెరికా, వీసా, మాస్టర్ కార్డ్ ల వత్తిడి మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ చర్యకు ఉపక్రమించింది. తమ లావాదేవీలకు ఇవి నష్టం తెస్తున్నాయని అమెరికా ఆగ్రహిస్తున్నది. దాని ప్రభావంతో మోడీ ప్రభుత్వం ఈ చర్యకు ఉపక్రమించింది. ఇది ప్రజావ్యతిరేక చర్య. కేంద్ర ప్రభుత్వం ప్రజల పై భారం వేసే



విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 17,18 తేదీలలో ఎక్కడికక్కడ నిరసనలు తెలపాలని ప్రజలను కోరుతున్నామన్నారు.

# మాజీ కౌన్సిలర్ శాఖమూరి స్వర్ణలత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పరామర్శ

ప్రజాదివాస్



నందిగామ పట్టణం రైతు పేట నందు మాజీ వార్డు కౌన్సిలర్ శాఖమూరి స్వర్ణలత మోకాలు శాస్త్ర చికిత్స అనంతరం ఇంటిలో విశ్రాంతి తీసుకొనుచుండగా కూటమి నేతలతో కలిసి ఆమెను వారి స్వగృహంలో కలుసుకుని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

# ఎవరికులమేంతో వారికంత వాట బహిరంగ పంచాయతీ కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాదివాస్




నర్సంపేట నియోజకవర్గ కమిటీ ఈ రోజు బిసి ఎస్సి ఎస్టి జెఏసి ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ లో సెప్టెంబర్ 27వ తేదీన హన్మకొండ హంటర్ రోడ్ డి,కన్వెన్షన్ లో జరగబోయే ఎవరి కులం ఎంతో వారికంత వాటా బహిరంగ పంచాయతీ సభ యొక్క కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిసి ఎస్సి ఎస్టి జెఏసి స్టేట్ కోఆర్డినేటర్ రామగిరి యాదగిరి స్వామి నర్సంపేట నియోజకవర్గ బిసి ఎస్సి ఎస్టి జెఏసి ఇంచార్జ్ ముంజాల రాజేందర్ గౌడ్, ఆబోతు రాజుయాదవ్ బిసి పవర్ రాష్ట్ర అధ్యక్షులు బిసి సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు సోల్తి సారయ్య సంగాల శివకృష్ణ జెఏసి నర్సంపేట మండల కోఆర్డినేటర్ జిల్లా సలహాదారులు గుంపుల మల్లయ్య, కూస రాజేందర్, ఎండి పాషా, ఓదెల సురేష్, రామగిరి రవీందర్, కందికట్ల సురేష్, రామగిరి రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని బీసీలు ఎస్సీలు ఎస్టీలు మహిళలు ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# కలెక్టర్ గారు అటెన్షన్ ప్లీజ్!




- అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రైవేటు 'రిఫరల్' దందా!
- సర్కారు దవాఖానా ముసుగులో దమ్మపేట ప్రైవేటు ఆసుపత్రికి అమాయకుల బదిలీ
- ఉన్నతాధికారి అండదండలతోనే కమీషన్ల కక్కుర్తి
- డెలివరీ పేరిట గిరిజన మహిళ మెడలోని బంగారం తాకట్టు
- సాధారణ గ్యాస్ నొప్పికీ రూ. 50 వేల బిల్లు ఎత్తుగడ.. అడ్డంగా దొరికిన సిబ్బంది చర్యలు శూన్యం
- ఉన్నతాధికారుల తక్షణ విచారణకు సర్వత్రా డిమాండ్

ప్రజాదివాస్

ఏజెన్సీ ప్రాంతంలోని నిరుపేదలు, బడుగు బలహీన వర్గాలు, అమాయక గిరిజనులకు ఉచిత వైద్యం అందించి ప్రాణాలు నిలపాల్సిన అశ్వారావుపేట సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వ ఆసుపత్రి) కొందరు స్వార్థపరులైన వైద్యులు, సిబ్బంది స్వలాభానికి అడ్డాగా మారుతోంది. గతంలో ఎప్పుడైనా వైద్యులు లేకపోవడం, అత్యవసర చికిత్సలకు సాంకేతిక పరికరాలు కొరవడటం వంటి సమస్యలు ఎదురైనప్పుడు కొత్తగూడెం, భద్రాచలం లేదంటే ఖమ్మం ప్రభుత్వాసుపత్రులకు నిబంధనల ప్రకారం రోగులను రిఫర్ చేసేవారు. కానీ ఇటీవల కాలంలో ఇక్కడి సర్కారు దవాఖానా వేదికగా ప్రక్క మండలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి రోగులను మళ్లించే పక్కా ప్రైవేటు రాకెట్ జోరుగా సాగుతోందన్న తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.డాక్టరమ్మ ప్రైవేటు సామ్రాజ్యం.. సిబ్బంది కమీషన్ల దందా! ఈ దందా వెనుక ఉన్న అసలు కారణాలు పరిశీలిస్తే విస్మయకర విషయాలు వెలుగుచూస్తున్నాయి. ప్రక్కనే ఉన్న దమ్మపేట మండల కేంద్రంలోని ఓ ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రి (గాయత్రి హాస్పిటల్) నిర్వహణలో అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో కీలక, ఉన్నత హోదాలో పనిచేస్తున్న ఓ మహిళా వైద్యురాలే ప్రధాన భాగస్వామిగా ఉన్నట్లు సమాచారం. దీంతో సదరు డాక్టరమ్మ మెప్పు పొందడానికో, లేక ప్రతి కేసుకు అందే ముడుపులు, కమీషన్ల ఆశతోనో ఆసుపత్రిలోని కొందరు ప్రధాన నర్సులు, కిందిస్థాయి సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేద రోగులను తీవ్రంగా భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వారికి లేనిపోని అపోహలు సృష్టించి, బ్రెయిన్ వాష్ చేసి మరీ దమ్మపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉండే ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లేనైనా పరిచయాలతో సర్దుబాటు చేసుకుంటామన్న రోగులను సైతం బెదిరించి, మా డాక్టరమ్మే అక్కడుంటారు మీకేం కాకుండా చూసుకుంటారు అంటూ బలవంతంగా దమ్మపేటకు తరలిస్తుండటం గమనార్హం.తాకట్టు పడ్డ పుస్తుల తాడు.. రూ. 71,000 దోపిడీ!ఈ రిఫరల్ దోపిడీకి నిలువెత్తు నిదర్శనంగా ఇటీవల రాచన్నగూడెం గ్రామానికి చెందిన ఓ నిరుపేద గిరిజన గర్భిణీ స్త్రీ విషయంలో జరిగిన సంఘటనే సాక్ష్యంగా నిలుస్తోంది. ప్రసవం కోసం సదరు గర్భిణీని కుటుంబ సభ్యులు అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, విధుల్లో ఉన్న ఓ ప్రధాన నర్స్ వారిని అడ్డగించింది. ప్రస్తుతం ఆసుపత్రిలో మత్తు అనస్థీషియా డాక్టర్ లేరు ఇక్కడ కాన్పు చేయడం అస్సలు సాధ్యం కాదు, వెంటనే దమ్మపేట ఆసుపత్రికి వెళ్లండి, అక్కడ మన మేడంగారే ఉంటారు, అంతా ఆమే చూసుకుంటారు, మీ మంచి కోసమే చెబుతున్నాం అని నమ్మబలికి బలవంతంగా దమ్మపేట ప్రైవేటు ఆసుపత్రికి పంపించినట్లు తెలుస్తుంది. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత ఆ అమాయకులకు చుక్కలు కనిపించాయి. చేరిన వెంటనే రూ. 10,000 అడ్వాన్స్ వసూలు చేసిన సదరు ప్రైవేటు యాజమాన్యం, డిశ్చార్జ్ సమయానికి ఏకంగా రూ. 71,000 బిల్లు చేతిలో పెట్టింది. అంత భారీ మొత్తం కట్టే స్తోమత లేక, ముక్కుమొహం తెలియని పరాయి మండలంలో గిరిజన కుటుంబం తీవ్ర వేదనకు గురైంది. చివరకు తమ వద్ద ఉన్న బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి, బతిమిలాడి రూ. 42,000కు సెటిల్ చేసుకుని బాధితులు బయటపడ్డారు. పేదలకు ఆసరాగా నిలవాల్సిన ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది చర్య వల్ల ఓ నిరుపేద కుటుంబం అప్పులపాలై బంగారాన్ని సైతం పోగొట్టుకోవాల్సి వచ్చింది.గ్యాస్ నొప్పికీ రూ. 50 వేల వల.. నిలదీసిన మహిళ! ఈ దోపిడీ ఒక్క గర్భిణీలతోనే ఆగడం లేదు. ఇటీవల నందమూరి నగర్‌కు చెందిన ఓ సాధారణ మహిళ స్వల్ప గ్యాస్ కడుపునొప్పితో అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి రాగా.. అక్కడి సిబ్బంది ఆమెను కూడా దమ్మపేట ఆసుపత్రికి వెళ్లాలని ఒత్తిడి చేశారు. తన వద్ద చిల్లిగవ్వ లేదని ఆ మహిళ మొరపెట్టుకోగా, అక్కడైతే రూ. 50 వేలు ఖర్చవుతుంది.. మాట్లాడి రూ. 30 వేలకే చేయిస్తాం అంటూ సిబ్బందే దళారుల్లా బేరసారాలు ఆడటం పరాకాష్ట. అనుమానం వచ్చిన ఆ మహిళ వేరే సాధారణ ప్రైవేటు వైద్యుడిని సంప్రదించగా, ఆమెకు ఎటువంటి సీరియస్ సమస్య లేదని, కేవలం చిన్నపాటి మందులతోనే నయమవుతుందని తేల్చారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన సదరు మహిళ తిరిగి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి, తనను తప్పుదోవ పట్టించిన సిబ్బందిపై విరుచుకుపడి నిలదీసిన వైనం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.ఉన్నతాధికారుల సమాధానంపై అనుమానాలు!

ఈ వరుస అరాచకాలపై స్పష్టమైన కాల్ రికార్డులు, ఆధారాలతో సహా అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాధా రుక్మిణి దృష్టికి తీసుకెళ్లగా, తొలుత ఆమె ఆసుపత్రిలో ఇలాంటి వాటికి తావులేదు.. విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం అని హామీ ఇచ్చారు. అయితే ఆ తర్వాత జరిగిన పురోగతిపై ప్రశ్నించగా, మా ఆసుపత్రికి, దమ్మపేట ఆసుపత్రికి ఎలాంటి సంబంధం లేదు. మా సిబ్బంది ఎవరినీ రిఫర్ చేయలేదు. రోగులే స్వచ్ఛందంగా వెళ్లారు అంటూ సమస్యను పక్కదారి పట్టించేలా సమాధానం ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఉన్నత బాధ్యతల్లో ఉన్నవారే ఈ అక్రమాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారనే ఆరోపణలకు ఈ వైఖరి మరింత బలం చేకూరుస్తోంది.కఠిన చర్యలు తీసుకోకుంటే ప్రజాక్షేత్రంలో ఆందోళనలు!

ఏజెన్సీ గిరిజన ప్రజల అమాయకత్వాన్ని, ప్రాణభయాన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేటు వ్యాపారానికి బాటలు వేస్తున్న సిబ్బంది, వారి వెనుక ఉన్న కీలక అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు, వైద్యారోగ్య శాఖ ఉన్నత వర్గాలు వెంటనే సమగ్ర విచారణ జరపాలని ప్రజలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ ఆసుపత్రిని కాపాడుకునేందుకు, పేదల హక్కుల కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలకు దిగుతామని ఏజెన్సీ ప్రజలు హెచ్చరిస్తున్నారు.







## పొన్నం సత్తయ్య గౌడ్‌కు జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ ఘన నివాళి



ప్రజాదివాస్

రాష్ట్ర రోడ్లు, రవాణా సంస్థ మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ 16వ వర్ధంతి సందర్భంగా బుధవారం కరీంనగర్‌లోని పొన్నం సత్తయ్య గౌడ్ తోటలో ఆయన విగ్రహానికి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పొన్నం సత్తయ్య గౌడ్ సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమాజ సేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, జగిత్యాల జిల్లా ఆర్టీవో నెంబర్ కమటాల శ్రీనివాస్, జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల కుటుంబాలను పరామర్శించిన : మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్





ప్రజాదివాస్

జగిత్యాల సీనియర్ రిపోర్టర్ జక్కుల రవీందర్ సోదరుడు ఇటీవల మృతి చెందడంతో రిపోర్టర్ రవీందర్ తో పాటు వారి కుటుంబ సభ్యులను జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ పరామర్శించారు. మృతికి గల కారణాలను తెలుసుకుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అదేవిధంగా నమస్తే తెలంగాణ జగిత్యాల ఆర్.సీ. రిపోర్టర్ మధు తల్లి మూటపెల్లి భూలక్ష్మి ఇటీవల మృతి చెందడంతో రిపోర్టర్ మధుతో పాటు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ . ఈ సందర్భంగా మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఆమె వెంట పలువురు జర్నలిస్టులు, నాయకులు, సన్నిహితులు ఉన్నారు.

## చెత్త ఎక్కడ పడితే అక్కడ వేస్తె జరిమానా తప్పదు మున్సిపల్ కమిషనర్ తిరుపతి

- మున్సిపల్ సిబ్బంది కీ సహకరించండి
- చెత్త బహిరంగ ప్రదేశాలలో వేస్తె వెయ్యి రూపాయల జీరిమాన

ప్రజాదివాస్



అందోల్‌జోగిపెట్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా,ప్రతి ఒక్కరూ తమ నివాసాలు, వ్యాపార సంస్థలు మరియు ఇతర ప్రదేశాల నుండి వెలువడే చెత్తను మున్సిపల్ పారిశుధ్య వాహనానికే అందజేయవలెను.మున్సిపాలిటీ పరిధిలోని బహిరంగ ప్రదేశాలు, రహదారులు, కాలువలు, ఖాళీ స్థలాలు తదితర ప్రదేశాల్లో చెత్తను పడవేయడం పూర్తిగా నిషేధించబడినది.ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పడవేసినట్లయితే, రూ.1,000/- (వెయ్యి రూపాయలు) జరిమానా విధించబడును. తదుపరి చట్టపరమైన చర్యలు కూడా తీసుకోబడును.ప్రజలు మున్సిపాలిటీకి సహకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచవలసిందిగా కోరడమైనది.

## ప్రతి బి ఆర్ ఎస్ కుటుంబ నాయకులకు కార్యకర్తలకు మేము అండగా ఉంటాం: పివిఆర్

ప్రజాదివాస్

ఇటీవల అనరోగ్యం తో చనిపోయిన జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గోడిశేలపేట గ్రామానికి చెందిన మాజీ బి ఆర్ ఎస్ పార్టీ మండల అద్యక్షులు తంగళ్లపాణి చక్రపాణి మృతి చెందారు మృతి చెందిన చక్రపాణి కుటుంబానికి మాజీ మంత్రి వర్యులు కొప్పుల ఈశ్వర్ ఆదేశానుసారం ప్రతి కుటుంబం లో ఒకరికి ఒకరు చేధోడు వాదోడుగా ఉండాలనీ ఒకరి కష్ట సుఖాల్లో ఒకరికొకరు పాలుపంచుకోవాలనీ తెలపడం తో వెలుగటూరు మండల ఏఎంసి చైర్మన్ పత్తిపాక వెంకటేష్ వర్మ చక్రపాణి కుటుంబానికి సహాయం అందించాల్సిందిగా మెసేజ్ చేయడంతో సుమరు 50000/- వెల్గటూర్ మండలం మరియు ఎండపెల్లి అలాగే ధర్మపురి నియోజకవర్గం నుండి ఎవరికి తోచిన విధంగా వారు సహాయం అందించారు ఈ



సందర్భంగా పత్తిపాక వెంకటేష్ వర్మ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన సహాయం చేసిన నాయకులకు స్నేహితులకు వారి కుటుంబము పై శ్రద్ధ చూపి సహాయం చేసిన వారికి మేము మీ కుటుంబం అని తెలపటం జరిగింది అని తెలియజేశారు అదేవిధంగా అన్ని విధాలా బి ఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటదని తెలియజేశారు అనంతరం ఒక చిన్న మెసేజ్ తో ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు అని కృతజ్ఞతలు తెలియజేశారు 24

# మోడల్ స్కూల్ ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎండిఓ వీరస్వామి



ప్రజాదివాస్

పెనుబల్లి మండల పరిధిలోని టేకులపల్లి లో ఉన్న మోడల్ స్కూల్ ని ఎండిఓ వీరస్వామి గారు ఆకస్మిక తనిఖీ చేశారు ఎండిఎం రికార్డ్స్ వంట సామాగ్రి వంటలు పరిశీలించారు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు మెనూ పాటించటం మరియు శుభ్రత రుచి ఇవన్నీ చక్కగా ఉన్నాయని పాఠశాల ప్రిన్సిపల్ ని మరియు ఇన్చార్జిలను అభినందించారు విద్యార్థులతో కలిసి కూర్చొని భోజనం చేశారు విద్యార్థులతో ముచ్చటిస్తూ అనేక విషయాలను అడిగి తెలుసుకున్నారు విద్యార్థులు కింద కూర్చొని భోంచేస్తున్నామని కిచెన్ షెడ్డు డైనింగ్ హాలు శాంక్షన్ చేయవలసిందిగా ఎండిఓ వీరస్వామి గారిని అభ్యర్థించారు కార్యక్రమంలో టేకులపల్లి పంచాయతీ సిబ్బంది మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టీ బి రూపస్ గారు మిడ్ డే మీ ఇన్చార్జిలు రాంబాబు దావూద్ పాషా గారు మరియు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# మాదకద్రవ్యాలకు దూరంగా క్రీడలకు చేరువగా యువత




ప్రజాదివాస్

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దామెర మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక 4 కిలోమీటర్ల పరుగు నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్ తెలిపారు.సెప్టెంబర్ 17న ఉదయం 9 గంటలకు డిస్నీలాండ్ ఉన్నత పాఠశాల నుంచి ఊరుగొండ వరకు ఈ పరుగు కొనసాగుతుందని తెలిపారు.యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచడం, క్రీడలు మరియు ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించడం కార్యక్రమం ఉద్దేశమన్నారు.కార్యక్రమ పోస్టర్‌ను దామెర ఎస్సై శ్రీ వీరభద్ర రావు ఆవిష్కరించారు. యువత, క్రీడాభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజ్ కుమార్ కోరారు.ఈ కార్యక్రమంలో గురిజాల శ్రీరామ్ రెడ్డి, సూర చందర్, మెరుగు శ్రీనివాస్, కొత్తపెల్లి శివ, అన్నబోయిన రోహిత్, జక్కుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూర్ గణేష్ ఉత్సవాల కమిటీలకు సూచనలు ఇచ్చిన ఆత్మకూరు సీఐ

**- ఆత్మకూరు సీఐ బాబూలాల్**



ప్రజాదివాస్

ఆత్మకూర్ మండలంలోని వివిధ గ్రామాలలో అర్ధరాత్రి గణేష్ ఉత్సవాలు మరియు ఇతర కార్యక్రమంలో అధిక శబ్దంతో డిజె సౌండ్స్ నిర్వహించడం వలన స్థానిక ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నట్లు అలాగే శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని డయల్ 112 ద్వారా మరియు పిఎస్ కు నేరుగా వచ్చి కంప్లైంట్ చేయడం జరుగుతుంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో డీజే మరియు అధిక శబ్దం వినియోగంపై సిపి వరంగల్ నిషేధిస్తూ ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగింది కావున భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సెకండ్ క్లాస్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్/తహసిల్దార్ ఆత్మకూర్ బైండోవర్ చేయడం జరిగింది.

# రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే మా లక్ష్యం..

**- రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశానికి నూతన దిశ: నీలం మధు..**

**- దేశ ఐక్యత కోసం కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు సుదీర్ఘ పాదయాత్ర చేపట్టడం అభినందనీయం..**

**- 1,500 కిలోమీటర్లకు పైగా పాదయాత్ర పూర్తి చేసిన కాటూరి వెంకటేశ్వర్లుకు పటాన్‌చేరులో ఘన స్వాగతం..**

**- పాదయాత్రలో పాల్గొని ముత్తంగి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నీలం..**





ప్రజాదివాస్

భారతదేశం కోసం ఎన్నో త్యాగాలు చేసి ప్రజా సమస్యలపై నిరంతరం పాటుపడుతున్న గాంధీ కుటుంబం వారసుడు రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా పాదయాత్ర చేపట్టడం గొప్ప విషయమని ప్రతి కార్యకర్త రాహుల్ ను ప్రధాని చేసేందుకు కృషి చేయాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు.దేశ ఐక్యత, సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యంగా కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు కొనసాగుతున్న జాతీయ పాదయాత్ర బుధవారం పటాన్‌చేరు నియోజకవర్గానికి చేరుకుంది. ప్రకాశం జిల్లాకు చెందిన న్యాయవాది, సామాజిక కార్యకర్త కాటూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ పాదయాత్రకు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముత్తంగి పుట్టి రింగ్ రోడ్ వద్ద ఘన స్వాగతం పలికారు అక్కడి నుంచి ముత్తంగి డివిజన్ పరిధిలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాటూరి వెంకటేశ్వర్లును శాలువాతో సత్కరించి అభినందించారు.కాటూరి వెంకటేశ్వర్లు గత జూన్ 19న కన్యాకుమారి నుంచి తన పాదయాత్రను ప్రారంభించారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల మీదుగా ఇప్పటివరకు 1,500 కిలోమీటర్లకు పైగా కాలినడకన ప్రయాణించి తెలంగాణలోని పటాన్‌చేరు నియోజకవర్గానికి చేరుకున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలు, అభిప్రాయాలు, ఆకాంక్షలను తెలుసుకుంటూ యాత్రను కొనసాగిస్తున్నారు.ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు ప్రజల ఆకాంక్షలకు అనుగుణమైన నాయకత్వం అవసరమని అన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగడం ప్రజాస్వామ్యానికి ఎంతో ముఖ్యమని అన్నారు.దేశంలో యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు భరోసా, మహిళలకు సమాన అవకాశాలు, పేదలకు సామాజిక భద్రత, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాలనే ఆలోచనలతో ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సోదరభావం, సామాజిక న్యాయం కోసం ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు వేల కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించడం సాధారణ విషయం కాదని, ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే సంకల్పంతో ఇంత సుదీర్ఘ ప్రయాణాన్ని చేపట్టిన కాటూరి వెంకటేశ్వర్లును అభినందిస్తున్నామన్నారు. ఎండ, వర్షం, అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ పాదయాత్రను కొనసాగించడం గొప్ప విషయమని కొనియాడారు.దేశంలోని అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా ఐ యన్ టీ యు సి జిల్లా అధ్యక్షులు కొల్కురి నర్సింహారెడ్డి, కౌన్సిలర్స్ గోపాల్ రెడ్డి, దస్తగిరి, మన్నే రాఘవేంద్ర, సంపత్ రెడ్డి, నారాయణదాసు, మణికంఠ, సందీప్ గౌడ్, మాజీ సర్పంచులు రాజి రెడ్డి, సుంకరి రవీందర్, జగన్, సీనియర్ నాయకులు ముత్తంగి అశోక్, మధు పంతులు, గడ్డ యాదయ్య, షాపురం నరసింహారెడ్డి, రుద్రారం లక్ష్మారెడ్డి , దండోరా నర్సింహ, గోపాలకృష్ణ, లక్దారం లక్ష్మ రెడ్డి, సంజీవ, సందీప్ యాదవ్, మైలారం శ్రీను, పాండు, శంకర్, ప్రకాష్ రాథోడ్, ప్రవీణ్, రంజిత్, రాజ్ గోపాల్,కాంగ్రెస్ నాయకులు శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు..

# మానవత్వంతో ముందుకొచ్చిన జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్: అడువాల జ్యోతి లక్ష్మణ్

**- హార్ట్ ఎటాక్‌తో మృతి చెందిన మున్సిపల్ శానిటేషన్ డ్రైవర్ ఎం.డి చాంద్ ఖాన్: కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందజేత**

ప్రజాదివాస్



జగిత్యాల జిల్లా జగిత్యాల మున్సిపల్ శానిటేషన్ విభాగంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.డి చాంద్ ఖాన్ హార్ట్ ఎటాక్‌తో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిత్యావసర వస్తువులను అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని, భవిష్యత్తులో కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని అడువాల జ్యోతి లక్ష్మణ్ తెలిపారు.

# కోటిలింగాల పార్వతి కోటేశ్వర స్వామి ఆలయ ఉండి లెక్కింపు :

**- హాజరైన దేవాదాయ శాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కమిషనర్ ఎన్. సుప్రియ**

ప్రజాదివాస్



జగిత్యాల జిల్లా వెలుగటూరు మండలం కోటిలింగాల శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ చైర్మన్ పూదరి.రమేష్ ఈవో కాంతరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టగా ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కమిషనర్ ఎన్. సుప్రియ హాజరు అయినారు అనంతరం నుండి లెక్కింపు చేయగా హుండీ ద్వారా రూపాయలు 1,89,958/- వచ్చినవి మరియు మిశ్రమ బంగారం 3 గ్రాముల 500 మిల్లీలు మిశ్రమ వెండి 210 గ్రాములు, వచ్చినవి అని డివో కాంత్ రెడ్డి తెలిపారు ఈ హుండీ లెక్కింపులో ఆలయ ధర్మకర్తలు వెంకటేష్ రవి గ్రామ సర్పంచ్ కోటయ్య పంచాయతీ సెక్రెటరీ ఎన్ శైలజ అర్చకులు సంజయ్ శర్మ నాగరాజు సిబ్బంది సేవా సభ్యులు వెల్గటూర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు

# కోటిలింగాల ఆలయ పునర్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ రాజ గౌడ్

ప్రజాదివాస్





జగిత్యాల జిల్లా వెలగటూరు మండలం కోటిలింగాల శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను మరియు వచ్చే 2027 గోదావరి పుష్కరాల పనులను దేవదాయ శాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కమిషనర్ ఎన్ సుప్రియ తో కలిసి పనులను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ రాజ గౌడ్ ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పూదరి రమేష్ ఈవో కాంతారెడ్డి ఎంపీడీవో పాడి వెంకటప్రసాద్ స్థానిక సర్పంచ్ పర్ష కోటయ్య ఏపిఎం అనిల్ ఆర్ ఐ లు రామ్ రెడ్డి రాజేశ్వరి ఆలయ ధర్మకర్తలు గుమ్ముల వెంకటేష్ ఆలయ పూజారులు నాగరాజ్ శర్మ సంజయ్ శర్మ మరియు ఆలయ సిబ్బంది

# నెక్కొండలో బైక్ దొంగ పట్టివేత

**- నెక్కొండ మసీదు వద్ద బైక్ చోరీ యత్నం దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు...**

ప్రజాదివాస్




నెక్కొండ మండల కేంద్రంలో చోరీకి యత్నించిన ఓ బైక్ దొంగకు స్థానికులు ఊహించని షాకిచ్చారు. మసీదు ప్రాంగణంలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని నైస్‌గా లేపేసేందుకు వచ్చిన నిందితుడిని స్థానికులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. చోరీ చేస్తుండగా గమనించిన ప్రజలు వెంటనే అతడిని రౌండప్ చేయడంతో దొంగ ప్లాన్ కాస్తా రివర్స్ అయింది. స్థానికుల సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.దొంగ ఆట కట్టించిన స్థానికుల సమయస్ఫూర్తిని పలువురు ప్రశంసిస్తున్నారు.